నమ్మలేని నిజాలు

యు. యస్.ఏ .ఆట
ఇపుడు పుతిన్ బాట
శాంతి ముద్దట.

పంటకు పుష్టి
ఎరువుల కొరత
రాబడి కోత.

త్రినేత్ర రాత్రి
లింగ ప్రవచనాలు
శివం సుందరం

డాలర్ కు చీడ
యూరోపు పిలుస్తుంది
పని పుష్కలం.

భరోసా మైకం
అప్పుతెచ్చిన ఉరి
అందని పైక

- రేడియమ్
సెల్: 9291527757




# నేటి నిజం

తెలుగు దినపత్రిక


website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com



శ్రీనిజాలు

ఆంబోతుల మధ్య నలుగు
తున్న అన్నదాతలు !
అల్లాడుతుంటె చోద్యం
చూస్తారా నేతలు !
రైతు మీద కక్షెందుకు
నీళ్లు ఎత్తిపోస్తె తప్పు !
పంటలెండి పోతె మనకు
మిగిలేది బూడిద కుప్పు !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245





హైదరాబాద్ గురువారం 13-3-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:172 పేజీలు:6 వెల: రూ.1/-


# తెలంగాణ ఉద్యమానికి పునాదులు నిరుద్యోగులే- రేవంత్



హైదరాబాద్, మార్చి 12: నిరుద్యోగ సమస్య తెలంగాణ ఉద్యమాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లిందని, రాష్ట్ర సాధనలో నిరుద్యోగులు క్రియాశీల పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగులు పునాదులుగా మారారని పేర్కొన్నారు. గత ప్రభుత్వానికి ఉద్యమం పట్ల బాధ్యత లేక నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరకలేదన్నారు.

గత ప్రభుత్వ పెద్దల ఉద్యోగాలు తీస్తేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని తాను చెప్పినట్లు సీఎం గుర్తు చేశారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ల ఉద్యోగాలకు ఎంపికైన 1,532 మందికి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కొత్తగా ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న వారికి సీఎం అభినందనలు తెలిపారు. కొత్త అధ్యాపకులు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపించాలన్నారు.

"కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 50వేలకు పైగా నియామకాలు చేపట్టాం. ఉద్యోగ నియామకాలకు సంబంధించి కోర్టుల్లో ఉన్న చిక్కుముళ్లు విప్పుతూ సమస్యలు పరిష్కరించాం. గతంలో సంతలో సరకులా ప్రశ్నపత్రాలు అమ్మారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉందని పెద్దలు చెప్పారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 25 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. 11వేల ప్రైవేటు పాఠశాలల్లో 36. 7 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం కంటే ప్రైవేటు పాఠశాలలు గొప్పవా? ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు రూ.25 వేల వరకు ఖర్చవుతుంటే.. ప్రభుత్వ బడుల్లో రూ. లక్ష వరకు ఖర్చవుతోంది. విద్యార్థుల భవిష్యత్తును విద్యాశాఖ తీర్చిదిద్దాలి. గతంలో విద్యాశాఖ నిర్లక్ష్యానికి గురైంది. విద్యాశాఖను ప్రక్షాళన చేసి ప్రభుత్వం అండగా ఉంది. విద్యకు ప్రాధాన్యం ఇచ్చి విద్యాశాఖకు రూ.21,650 కోట్లు కేటాయించాం" అని సీఎం వివరించారు.

## పార్టీ ఫిరాయింపులపై సుప్రీం సీరియస్
# 25లోగా కౌంటర్.. దాఖలకు ఆదేశం

-అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం
-బీఆర్ ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలు
-నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు తెలిపిన సుప్రీంకోర్టు
-అసెంబ్లీ సెక్రెటరీ, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ
-తాజా విచారణలో కీలక వ్యాఖ్యలు చేసిన న్యాయమూర్తులు

హైదరాబాద్, మార్చి 12:పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టులో జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. నోటీసులు అందుకున్న వారు ఈ నెల 25వ తేదీలోగా ఎట్టి పరిస్థితుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ.. జనవరి 15వ తేదీన బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌పై.. పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ)ను దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికపూడి గాంధీపై కేటీఆర్ రిట్ పిటీషన్ దాఖలు చేశారు. అయితే, అన్ని పిటిషన్లను ఒకే దగ్గర కలిపి సుప్రీం ధర్మాసనం విచారణ చేపడుతోన్న విషయం తెలిసిందే.

ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలంటూ ఇప్పటికే అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు నోటీసులు అందాయి. అదేవిధంగా అసెంబ్లీ సెక్రటరీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు, పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

# హైడ్రాలిక్ పవర్డ్ రోబోతో రెస్క్యూ ఆపరేషన్



అమ్రాబాద్,మార్చి 12:ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు అన్వీ రోబోటిక్స్ సంస్థకు చెందిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోను బుధవారం ఉదయం ప్రమాద ప్రదేశానికి తీసుకెళ్లారు. రోబో ద్వారా టన్నెల్ లోపల ఉన్న శిథిలాలను తొలగించడం, భూమిని తవ్వడం, వంటి సహాయక చర్యలు చేపట్టనున్నారు. మనుషుల కన్నా 15 రెట్లు అత్యధిక సామర్థ్యంతో రోబో పనిచేయడం ప్రత్యేకత అని, ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలను వేగంగా పూర్తి చేయడానికి ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు సహాయక చర్యలను మరింత వేగంగా, సమర్థంగా ముందుకు తీసుకెళ్లడానికి రోబోలు ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

టన్నెల్ లోపల ఉన్న శిథిలాలు, మట్టి కుప్పలు, తేమ, ఆక్సిజన్ సమస్యలు వంటి అడ్డంకులను దృష్టిలో పెట్టుకొని రోబోలను రంగంలోకి దించినట్లు తెలిపారు. అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా 40 హెచ్‌పీ పంపు సహాయంతో బురదను బయటికి పంపనున్నారు. ఈ రోబో గంటకు ఐదు వేలు క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించే సామర్థ్యం కలిగి ఉందని తెలిపారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, రోబోను పరిశీలించిన అనంతరం, అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోతో విజయ్, అక్షయ్ తమ బృందంతో కలసి లోకో ట్రైన్ ద్వారా టన్నెల్ లోపల ప్రమాద ప్రదేశానికి వెళ్లారు. ప్రస్తుతం సహాయక చర్యల్లో 12 కేంద్ర, రాష్ట్ర సంస్థలకు చెందిన బృందాలు 24 గంటలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. మానవ సహాయక బృందాలకు అవసరమైన సామాగ్రి, నీరు, మెడికల్ సపోర్ట్, ఆక్సిజన్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఏడుగురు ఆచూకీ కోసం బుధవారం నుంచి రోబోలతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. మంగళవారం కమ్యూనికేషన్ రోబోను పంపించి పరిస్థితి అంచనా వేశారు. ఉదయం రోబోను లోపలకు పంపించారు. రెస్క్యూ ఆపరేషన్ 19వ రోజుకు చేరుకుంది. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. జీపీఆర్, క్యాడవర్ డాగ్స్ గుర్తించిన ప్రదేశాల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. చికుక్కున ఏడుగురు ఆచూకీ కోసం విస్తృత చర్యలు కొనసాగుతున్నాయి. టన్నెల్ లోపల ఉన్న ప్రమాదకర ప్రాంతాలను తవ్వేందుకు రోబోలను వినియోగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

# కేసీఆర్ తో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి భేటి

హైదరాబాద్, మార్చి 12:తెలంగాణ అసెంబ్లీ లాబీలో నేడు ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఫిరాయింపు నేత, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కలుసుకున్నారు. తన



తమ్ముడి కుమారుడి పెళ్లికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. అయితే ఫిరాయింపు నేతల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి ఎంత సమయం కావాలో చెప్పాలంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు ఇటీవల నోటీసులు జారీచేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఫిరాయింపుదారులపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని ఎదురుచూస్తున్న తరుణంలో కేసీఆర్‌ను మహిపాల్ రెడ్డి కలవడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ ఆ తర్వాత జరిగిన పరిణామాలతో కొంతకాలానికే ఆయన యూటర్న్ తీసుకున్నారు. కాంగ్రెస్‌లో అనధికారికంగా కొనసాగుతున్నప్పటికీ పలు సందర్భాల్లో బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. అంతెందుకు పటాన్‌చెరులోని తన క్యాంపు కార్యాలయంలో కూడా కేసీఆర్ ఫొటోనే పెట్టుకున్నారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించినప్పటికీ.. బరాబర్ కేసీఆర్ ఫొటో ఉంచుకుంటానని స్పష్టం చేశారు. పదేండ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో సహకరించారని గుర్తుచేశారు. క్యాంపు కార్యాలయం తన నివాసమని, ఇక్కడ కేసీఆర్ ఫొటో పెట్టుకోవడంలో తప్పేమిటని ప్రశ్నించారు.

# నెల రోజుల్లో వైద్యశాఖ ఖాళీల భర్తీ

## – డీఎంఈ శివరాంప్రసాద్

నల్గొండ, మార్చి 12:ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయల కల్పించి, ఖాళీగా ఉన్న వైద్య పోస్టులతో సహా ఇతర పోస్టులను నెల రోజుల్లో భర్తీ చేయనున్నట్లు తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ శివరాంప్రసాద్ తెలిపారు. బుధవారం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన పరిశీలించారు. ఐసీయూ, క్యాజువాలిటీ, ఎంసీహెచ్ వార్డులతో పాటు పలు వార్డులు కలియతిరిగారు. రోగులు, వారి సహాయకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆనంతరం మెడికల్ కళాశాలను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, టెక్నికల్ సిబ్బందితో పాటు పారిశుద్ధ్యం, సెక్యూరిటీ ఇతర అన్ని రకాల పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆస్పత్రుల్లో వైద్యుల కొరత ఉన్నది వాస్తవమేనని అందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్ ను విడుదల చేసినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో 80 మంది సీనియర్ ప్యాకల్టీలను కౌన్సిలింట్‌కు పిలిచి ఆస్పత్రులకు కేటాయించనున్నట్లు తెలిపారు. సిబ్బందిని పెంచడంతో పాటు రోగులకు అసరపమైన మందులను కూడా అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. బెడ్ల కెపాసిటీకి మించి ఆస్పత్రికి రోగులు వస్తున్నందున అందుకు తగ్గట్టుగా త్వరలో ప్రణాళికలు తయారు చేసి ప్రజా వైద్యాన్ని బలోపేతం చేస్తామని చెప్పారు.

### నేటి కందం- నేటికి అందం

ఇజములు చేయ నెరుంగని
అజరామర సేవలనిడ నాత్మీయతతో
నిజముగ జరుపంగవలయు
ప్రజలందరు కలసి రోటరాక్టు దినంబున్!!

(మార్చి 13 : ప్రపంచ రోటరాక్టు దినోత్సవం)

-రాధశ్రీ
సెల్:9494481210






# బహుముఖ ప్రజ్ఞాశాలి డా॥ బూర్గుల రామకృష్ణారావు



డాక్టర్॥బూర్గుల రామకృష్ణారావు ఇప్పటి రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పడకల గ్రామంలో 13 మార్చి 1899 వ సంవత్సరంలో నరసింహారావు, రంగనాయకమ్మ దంపతులకు జన్మించారు. వారి స్వగ్రామం షాద్ నగర్ తాలూకాలోని బూర్గుల గ్రామం. ఇంటిపేరు పుల్లమ్మ రాజు. మహారాష్ట్రలో చదువు నిమిత్తమైన నివసిస్తున్నప్పుడు అక్కడి సాంప్రదాయం మేరకు తన ఊరి పేరు బూర్గులనే ఇంటి పేరుగా మార్చుకున్నారు.

బూర్గుల రామకృష్ణారావు ప్రాథమిక విద్య హైదరాబాదులోని ధర్మపంత్ పాఠశాలలో పూర్తిచేసుకుని తరువాత ఎక్సెల్షియర్ పాఠశాలలో చేరారు. 1915లో ముంబాయి విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్ పరీక్ష ఉత్తీర్ణులయ్యారు. ఆ తర్వాత 1918లో నిజం కళాశాలలో పార్సీ ద్వితీయ భాషగా ఇంటర్మీడియట్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. పూణేలోని ఫెర్గుసన్ కాలేజీలో బి.ఏ (ఆనర్స్) చదివారు. ఆ కళాశాలలో చదువుతున్నప్పుడే "లోకమాన్య బాలగంగాధర్ తిలక్ "మరణించారు. సంతాప సూచికంగా కళాశాల బంద్ చేయాలని, ఆందోళన నిర్వహించారు. ఆనాటి నుండి బూర్గుల ఖద్దర్ ధరించడం మొదలుపెట్టారు. మహారాష్ట్రకు హైదరాబాద్ కు ఉన్న సన్నిహిత సంబంధాల వల్ల అక్కడి ఉద్యమాల ప్రభావం హైదరాబాద్ సంస్థానం మీద పడింది. హైదరాబాద్ రాష్ట్రం నుండి వ్యాపార, విద్య, వైజ్ఞానిక, వైద్య విషయాలలో ఎక్కువగా ముంబైకి వెళ్లేవారు.

1923 బొంబాయి విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో చేరిన ఎల్.ఎల్.బి పట్టా పొందారు. ఒకవైపు న్యాయ విద్యను అభ్యసిస్తూనే "అంజుమనే ఇస్తామియా" హైస్కూల్లో పర్షియన్ ఉపాధ్యాయుడిగా చేరి తన ఖర్చులకు డబ్బులు సంపాదించుకునేవారు. నాటి పత్రికలలో హైదరాబాద్ సంస్థాన సమస్యలను ప్రస్తావిస్తూ లేఖలు రాసేవారు. న్యాయవాద వృత్తి హైదరాబాదులో ప్రారంభించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఎటువంటి కేసులైన చాకచక్యంగా వాదించి పరిష్కరించగలరనే ప్రఖ్యాతి పొందారు.

సీనియర్ న్యాయవాదిగా ఉన్నప్పుడు బూర్గుల వారి వద్ద పి.వి.నరసింహారావు జూనియర్ గా చేరి ప్రియమైన శిష్యుడిగా మారిపోయారు. ఇద్దరి మధ్య వయోభేదం ఎంతున్నా పి.వి. గారితో స్నేహితునిగా వ్యవహరించేవారు. పి.వి. న్యాయవాద వృత్తిలోనూ, రాజకీయాల్లోనూ బూర్గుల ఆదర్శవంతమైన గురువుగా నిలిచారు.

బూర్గులకు కాంగ్రెస్ పట్ల అపరిమితమైన అభిమానము. చిన్న వయసులోనే కాంగ్రెస్ సమావేశాలో పాల్గొని జాతీయ నాయకుల ప్రశంసలు పొందినారు. శ్రీ స్వామి రామానంద తీర్థతో కలిసి నిజాం స్టేట్ కాంగ్రెస్ స్థాపనకు ప్రముఖ పాత్ర వహించారు. గాంధీ ఉత్సవాలను నిర్వహిస్తున్న సందర్భంగా 1947వ సంవత్సరంలో అరెస్టు చేయబడి నారు. ప్రజలు ఎవ్వరు సమావేశాలు జరపకూడదన్న నిజాం ఉత్తర్వును వ్యతిరేకించి 1947 సంవత్సరంలో మే 8వ తారీఖున పబ్లిక్ సమావేశంలో ఉపన్యాసమిస్తూ అరెస్టు అయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావానికి బూర్గుల వారు అందించిన సేవ అపూర్వమైనది.

1927లో బూర్గుల రామకృష్ణారావు "ఉమర్ ఖయ్యాం"మీద రాసిన వ్యాసం సుజాత పత్రికలో ప్రచురించబడింది. ఉమర్ ఖయ్యాం జననం మొదలుకొని కవిత్వం, ప్రణయభావన మొదలైన విషయాలను ఆ వ్యాసంలో వివరించారు. ఈశ్వర్ తత్వంపై వ్యాసాలు ప్రచురించారు.

కాకునూరి అప్ప కవి జన్మస్థాన నిర్ణయంపై 1933 లో గోల్కొండ పత్రికలో పరిశోధనాత్మక వ్యాసాన్ని ప్రచురించారు. మహబూబ్నగర్ జిల్లా ఒకప్పటి కల్వకుర్తి తాలూకాలోని కాకునూరి గ్రామమే అప్పకవి స్వంత గ్రామమని నిరూపణ చేశారు. కొమ్మరాజు లక్ష్మణరావు, గిడుగు వెంకట సీతాపతి వంటి వారు అప్పకవి జన్మస్థాన నిర్ణయంపై చేసిన పొరపాటును ఋజువు చేశారు. అప్పకవి ప్రస్తావించిన "నవదల పురి"కాకునూరి సమీపంలోని తొమ్మిది రేకుల గ్రామమని నిరూపణ చేశారు.

ప్రభాత వేళ వెంకటేశ్వరుని మేలుకొలుపుకై బూర్గుల" శ్రీ వేంకటేశ్వర శతకం"రాశారు.

**"ఉనీమిల్య నేత్ర సరూ మహాయుగ్మ మధ్య "**
**"సంసార సాగర సముత్తర నైకసేతః"**
**"సంబందలూం తన కృపా.. మయదృష్టి జావైః**
**"శేషాద్రి శేఖర విభోతన..సుప్రభాతమ్"** దీని అనువాదము ఇలా కమనీయంగా చేశారు.

**"నీకమనీయ నేత్ర నవనీరజ యుగ్మము విప్పి యిప్పుడే**
**లోకముపై కృపారస విలోకజాలము గుప్పి దానిచే**
**బొకటమొప్ప గట్టు యొక వారధి నీభవన సారంగంబువై**
**లోకులు దాట శేషగిరిలోలుడ మేల్కొను వెంకటేశ్వరా!"**

కృష్ణ శతకంలో 101 పద్యాలు న్నాయి. ఇది భక్తి శతకము. 1955లో వారికి టైఫాయిడ్ జ్వరము వచ్చినప్పుడు నెల రోజులు విశ్రాంతి తీసుకునే సమయంలో ఆ భగవంతుడి నామస్మరణ చేస్తూ వెంకటేశ్వర సుప్రభాతము, కృష్ణ శతకము రాసినట్లు బూర్గుల చెప్పుకున్నారు. సగభాగం అనారోగ్య కాలమునందు మిగతా సగం ఏడాదిలో

పూర్తి చేశారు. మనిషి కోర్కెల ఊబిలో కూరుకపోయి ఎండమావుల వెంట

**"ఏమి మనస్సోహరిహరి**
**స్వామిని బడదోసి స్వారి..సలిపెడుగుర్రం**
**బేమో యనిపించును వడిగా**
**మిత్రులు వెంటబడుట..గాంచిన కృష్ణా"**

కేరళ గవర్నర్గా ఉన్న కాలంలో గురువాయూరు శ్రీకృష్ణ క్షేత్రము దర్శించి వారిపై చెప్పిన ఎనిమిది పద్యాలే" శ్రీ కృష్ణాష్టకము"స్రవంతి సంచికలు 1958 ఏప్రిల్ లో ప్రచురితమైంది. ఒక పద్యం చూద్దాం..

**"పచ్చని యాకులే జిగేలు..బారెడు నీటి పరాకు పాటలం**
**దత్తపు వెండి వెన్నెలల నా..మని బూచెడు పువ్వు నవ్వులో**
**బిచ్చుక గొంతులో నోరు..లబ్బిము దీను నాల్కతో**
**నచ్చగితాలి శుద్ధముగు..స్వాంతములోకని పింతుకేశవాయ!"**

ఉర్దూ భాషా సార స్వతములు వ్యాసాన్ని చదివితే ఉర్దూ భాష మీద బూర్గుల పట్టు అవగతమవుతుంది. ఉర్దూ భాషా చరిత్రను ఆధార సహితంగా యుగాలుగా విభజన చేసి ఉర్దూ సాహిత్య పరిణామాన్ని విశ్లేషణ చేశారు.

డాక్టర్ : బూర్గుల రామకృష్ణారావు గారు చేపట్టని పెంపొందించిని క్షేత్రం ఏది లేదంటే అతిశయోక్తి ఏమాత్రం లేదు ఏ సాహిత్య క్షేత్రానికైతే వారి సునిషిత మేధా సంపత్తి అనుకూలంగా ఉండేదో ఆ సాహిత్య క్షేత్రంలో చెప్పుకోదగ్గ రచనలు చేయడానికి వారికి అవకాశం కలుగలేదు.

రాజకీయ వేత్తగా కూడా బూర్గుల వారు తమ కాలం నాటి అంటే దేశ చరిత్రలో చాలా ప్రధానమైన ఉత్తేజ కరమైన దశాబ్దాలకు సంబంధించిన స్మృతులను గ్రంథస్తం చేసి ఉండవలసింది. నా హితైలెంత చెప్పినప్పటికీ వారా పనులు చేయలేకపోయారు. ఆ విధంగా వారు తమ జీవితకాలంలో ఎంతో విలువైన పనులు చేసినప్పటికీ చేయకుండా వదిలివేసింది కూడా అంతకన్న ఎక్కువ విలువైనదే అని నా అభిప్రాయం.

ఎందుకంటే ఆ పనులు చేయడానికి ఇతరులు ఎవరికంటే కూడా వారే మిక్కిలి సమర్థులు. అందుకు నేనూ, నాలాగే ఇతరులు చాలామంది కూడా ఎప్పుడు బాధపడుతూనే ఉన్నాం. డాక్టర్॥రామకృష్ణ రావు గారిని గురించి ఎంతైనా వ్రాయవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే వారు పూర్ణ పురుషులు. అని మాజీ ప్రధానమంత్రి బహుభాష వేత్త పాములపర్తి వేంకట నరసింహారావు గారు బూర్గుల గురించి ఒక వ్యాసంలో తెలియచేశారు. (ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక 1972 డిసెంబర్.

రాజకీయాలలో బూర్గుల సమ్యక్ దృష్టి కోణం సంకుచిత సైద్ధాంతిక అరులకు తావు ఇవ్వలేదు. వారు పుట్టింది జాగీర్దర్ కుటుంబంలో ఉన్నప్పటికీ వారు పూర్వపు హైదరాబాద్ సంస్థానంలో తరతరాల నుండి వస్తున్న జాగిర్దారి వ్యవస్థను రూపుమాపడానికి వెనుకా డలేదు. వారి స్నేహ కోటిలో పెద్దపెద్ద భూస్వాములు చాలామంది ఉండేవారు. అయినప్పటికీ బూర్గుల వారు పూర్వపు హైదరాబాదు రాష్ట్రంలో "×దున్నేవానికెభూమి"× హక్కునిచ్చే కౌలుదారి చట్టాన్ని తయారుచేసి, దేశంలో సామ్యవాద వ్యవస్థకు మార్గదర్శకులైనారు. ఆ చట్టాన్ని అమలు పరచడానికి వారు ఎంపిక చేసిన జిల్లాల్లో ఎక్కువగా నష్టపోయిన భూఖామందులు వారి బంధువులూ, రాజకీయ సహచరులే దీన్నిబట్టి బూర్గుల ప్రజాస్వామ్య, సామ్యవాద దృక్పథం అర్థం చేసుకోవచ్చు. వారికి విద్యార్థి దశలోనే ప్రజాహిత కార్యక్రమాల పట్ల ఎక్కువగా ఆసక్తి ఉండేది. శ్రీ వామన్ నాయక్ అధ్యక్షతన "హైదరాబాద్ యంగ్ మెన్స్ యూనియన్" పేరుతో సంస్థను స్థాపించారు. దానికి కార్యదర్శిగా పనిచేశాడు. మాడపాటి హనుమంతరావు తదితరులతో కలిసి 1921లో ఆంధ్ర కేంద్ర జన సంఘం స్థాపించి జాతీయోద్యమ చైతన్యానికి పూనుకొన్నాడు. ఆ రోజుల్లో నిజాంకు వ్యతిరేకంగా పోరాడుతూ వెట్టి చాకిరి నిర్మూలనకు ఈ సంస్థ కృషి చేసింది. ఈ సంఘం అక్షరాస్యత కార్యక్రమాలు సాహిత్య సభలు సమావేశాలు మహనీయుల జయంతులు వర్ధంతులు నిర్వహించి తెలుగు భాషాభివృద్ధికి తోడ్పాటు నందించింది.

1930లో ఏర్పడిన ఆంధ్ర మహాసభకు మొదటి అధ్యక్షులు సురవరం ప్రతాపరెడ్డి గారు. 1931లో దేవరకొండలో జరిగిన ద్వితీయ మహాసభలకు రామకృష్ణారావు అధ్యక్షులు ఆ సభలో రామకృష్ణారావు ప్రకటించిన కొన్ని రాజకీయ అభిప్రాయాలు ప్రభుత్వ ఆగ్రహానికి కారణం కావడంతో తరువాత మూడేళ్ల పాటు మహాసభకు అనుమతి ఇవ్వలేదు. 1934లో ప్రభుత్వ అనుమతి వచ్చిన అనేక అడ్డంకులు ఎదురయ్యాయి .తన చాతుర్యంతో దక్షతతో వాటన్నిటిని బూర్గుల పటాపంచలు చేసి మహాసభలను విజయవంతంగా నడిపించారు. 1923లో జరిగిన కాకినాడ మహాసభకు ఉత్తర భారతదేశం నుండి వచ్చిన నాయకుల ఉపన్యాసాలను శ్రీమతి సరోజినీ నాయుడు ఆదేశాలతో తెలుగులోకి అనువదించి తన భాషా పాటవాన్ని ప్రదర్శించారు.

1936లో స్వామి రామానంద తీర్థ వంటి నాయకులతో కలిసి స్టేట్ కాంగ్రెస్ స్థాపనకు కృషి చేశారు .జయప్రకాష్ నారాయణ్ ను హైదరాబాద్ రాకుండా నిషేధించినప్పుడు ప్రభుత్వ తీరును విమర్శించి తొలిసారి జైలుకు వెళ్ళాడు. మరో వైపు స్టేట్ కాంగ్రెస్ స్థాపన జరగడానికి వీలు లేకుండా నిజాం ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించి అడ్డంకులు సృష్టించింది. 1938లో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి కార్యవర్గం ఏర్పాటు చేయాలని నిశ్చయించగా ప్రభుత్వం స్టేట్ కాంగ్రెస్పై నిషేధం విధించింది .ఈ విషయంపై ఢిల్లీ వెళ్ళిన ఏకైక తెలంగాణ ప్రతినిధి బూర్గుల. నా డు సర్కార్ హైకోర్టు జడ్జి పదవిని ఇవ్వచూపిన తిరస్కరించిన మహనీయుడు.

ముఖ్యమంత్రిగా నిర్ణయాలు వెల్లోడి మంత్రివర్గంలో బూర్గుల రెవెన్యూ ,ఎక్సైజ్ ,విద్యా శాఖలను నిర్వహించారు. తరువాత 1952 సాధారణ ఎన్నికలలో షాద్ నగర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి స్వల్ప మెజారిటీ ఉన్నప్పటికీ 1956 ఆంధ్రప్రదేశ్ ఏర్పడే వరకు చాకచక్యంగా ప్రభుత్వాన్ని నడిపించారు. ప్రతిపక్షాలు సైతం ఆయన పరిపాలన తీరును సమస్య పరిష్కార చాతుర్యాన్నిపొగిడిన సందర్భాలు అనేకం.

(మార్చి 13 న బూర్గుల రామకృష్ణారావు జయంతి సందర్భంగా)

–డాక్టర్॥ నాగయ్య ధర్మారపు
7780162901



# వైభవంగా మహిళా దినోత్సవం



హైదరాబాద్, మార్చి 12: కాప్రా మల్కాజ్గిరి కవల వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. సుమారు 75 మంది కవులు, కవయిత్రులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు.

ప్రముఖ కవి, సినీగీత రచయిత మౌనశ్రీ మల్లిక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత్రి విజయలక్ష్మి పండిట్ హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా దాస్యం సేనాధిపతి, దేవులపల్లి పద్మజ, గంట మనోహర్ రెడ్డి, అంబటిలింగ కృష్ణారెడ్డి, దీపక్ న్యాతి పాల్గొన్నారు.

రాధా కుసుమ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం ఘనంగా జరిగింది. గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ కార్యనిర్వాహణ దక్షతను పలువురు కవులు కొనియాడారు. ముఖ్య అతిథి విజయలక్ష్మి పండిట్ మాట్లాడుతూ.. స్త్రీలు అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారని, అందుకు పురుషుల సహకారం కూడా ఉందని, సమాజం అంటే స్త్రీలు పురుషులు ఇద్దరు అని అన్నారు. కార్యక్రమంలో మూర్తి శ్రీదేవి, తులసి వెంకటరమణాచార్యులు వందన సమర్పణ చేశారు.


ఆహ్వానం

తెలంగాణ సారస్వత పరిషత్తు
హైదరాబాద్

ధర్మనిధి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం

తేది & సమయం : 2025 మార్చి 18, మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు
వేదిక : డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం, పరిషత్తు ప్రాంగణం, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాదు

అధ్యక్షులు
ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారు
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు

ముఖ్యఅతిథి
డా. బి. చిన్నారెడ్డి గారు
ఉపాధ్యక్షులు, తెలంగాణ ప్రణాళికా మండలి

విశిష్ట అతిథులు
డా. ఎన్. రామచందర్‌రావు, శాసనమండలి మాజీ సభ్యులు
శ్రీ జి.వి. శ్యాంప్రసాద్ లాల్ గారు
సంయుక్త కార్యదర్శి, జ్యోతిబాపూలే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంస్థ

గౌరవ అతిథులు
డా. తిరుమల శ్రీనివాసాచార్య, ప్రముఖ సాహితీవేత్త
శ్రీ మడుపు ప్రభాకరరావు, కెనడా
శ్రీ బి. గోపాలకృష్ణ

| పురస్కారాలు | సమ్మాన్యులు |
|---|---|
| డా. కె. అంజిరెడ్డి పురస్కారం | బైస దేవదాస్ |
| డా. బి.ఎన్. శాస్త్రి పురస్కారం | ద్యావనపల్లి సత్యనారాయణ |
| డా. తిరుమల శ్రీనివాసాచార్య పురస్కారం | మౌనశ్రీ మల్లిక్ |
| ఆచార్య మడుపు కులశేఖరరావు పురస్కారం | ఆచార్య గుండెడప్ప కనకయ్య |
| నారపరాజు రాఘవసీత పురస్కారం | టి. శ్రీరంగస్వామి |
| తిరుమల స్వరాజ్యలక్ష్మి పురస్కారం | డా. తాళ్ళపల్లి యాకమ్మ |
| బూర్గుల రంగనాథరావు పురస్కారం | డా. వి. శంకర్ |

ఈ కార్యక్రమానికి అందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

డా. జుర్రు చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు











# సృజన శక్తీ, ప్రయోగానురక్తీ కలిసిన వ్యక్తిత్వదీప్తి - సుధామ





-విహారి
సెల్:9848025600







తెలుగు సాహితీ లోకానికి సుపరిచితులు – సుధామ. జాతీయకవిగా, కార్టూనిస్ట్‌గా, చిత్రకారునిగా, సమీక్షకునిగా, వ్యాఖ్యాతగా, సినీవిశ్లేషకునిగా, కాలమిస్ట్‌గా, వక్తగా, పదబంధ ప్రహేళికల నిర్మాతగా, 'సప్తపది' లఘుకవితా నూత్న ప్రక్రియల ఆవిష్కర్తగా, ప్రయోగశీలిగా సుధామ, సాహిత్యాభినివేశం ఉన్న ప్రతి తెలుగు పాఠకునికీ అభిమానపాత్రులు. రచయితగా, సాహితీవేత్తగా, యువభారతి ముఖ్యకార్తకర్తల్లో ఒకరుగా – ఎందరో ప్రముఖులకూ, సాహితీకారులకూ ఆయన ఆత్మీయ స్నేహితుడు, సన్నిహితుడు, హితుడూ కూడా. సుధామ వివిధ ప్రక్రియల్లో బహుగ్రంథకర్త, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ప్రతిష్ఠాత్మక సన్మాన, సత్కార, పురస్కారాలు పొందిన సుధీమంతుడు! రేడియో 'వాడి'గా, అనేక టీవీ చర్చల 'నాడి'గా – శ్రోతలకూ, వీక్షకులకూ కూడా దగ్గరివాడు. ఐదున్నర దశాబ్దాలకు పైబడిన అవిరళ సాహితీ మాగాణంలో 'పొద్దుచాలని' కృషీవలుడు.

## జననం : విద్యాభ్యాసం

సుధామ (అల్లంరాజు వెంకటరావు), జననం : 25.11.1951, తల్లిదండ్రులు : కీ.శే.అల్లంరాజు (ద్విభాష్యం) రాజేశ్వరమ్మగారు,కీ.శే. అల్లంరాజు కామేశ్వరరావుగారు. విద్యాభ్యాసం : ఒకటోతరగతి నుండి ఎం.ఓ.యల్., ఎం.ఫిల్ వరకు హైదరాబాద్‌లోనే. కేశవ మెమోరియల్ పాఠశాల, మలక్‌పేట ప్రభుత్వ పాఠశాల, వివేకవర్ధినీ కళాశాల, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల్లో.

## వృత్తి, ఉద్యోగాలు :

1975–1977 బిషప్ సాలమన్ జూనియర్ కళాశాల కరీంనగర్‌లో తెలుగు లెక్చరర్‌గా పనిచేశారు. 1978లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో (వివిధభారతి) ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా చేరిక తర్వాత, 1990లో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పదోన్నతి, విజయవాడ, వరంగల్, హైదరాబాద్ కేంద్రాలలో కార్యక్రమనిర్వహణాధికారిగా పనిచేసి, 2008లో ఆకాశవాణి వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం నుండి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎం.ఏ. (తెలుగు) ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అకడమిక్ కౌన్సిలర్‌గా కొన్నాళ్ళున్నారు.

## సాహిత్య ప్రవృత్తి: చలనం, గమనం, పయనం :

అనేకానేక ప్రక్రియల్లో సాహిత్యకృషి నెరపిన సుధామ – తొలి కదలిక కథారచన అని తెలియటం ఆనందాన్ని కలిగిస్తుంది. 1965లో 14 ఏళ్ల ప్రాయంలోనే మొదటి కథ 'బాలబంధు' లో అచ్చయింది. అది అల్లంరాజు వెంకటరావు పేరుతోనే వచ్చింది. 1967 నుండి వెంకటరావు సుధామగా సాహితీలోక విహారం మొదలెట్టారు. కథకుడుగా 1980 వరకూ సుమారు 40 కథలు – ఆంధ్రజనత, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, స్వాతి, జ్యోతి,చుక్కాని, జ్యోతి, జయశ్రీ, వసుధ వంటి సుప్రసిద్ధ పత్రికల్లో అచ్చయినాయి. 1980 తర్వాత వారి కలం కథ చెప్పలేదు!

కాలేజీలో వుండగా 'విజ్ఞానజ్యోతి' వ్రాతపత్రికను,1967 'యువమిత్ర' లిఖిత పత్రికను నిర్వహించారు. 'యువమిత్ర' ఒక దశాబ్దంపాటు వెలువడిందంటే ఇప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది! సినారె వంటి పెద్దలు ఎందరో దాన్ని చదవి, 'నేటి ముద్రిత పత్రికలు ముఖం చూసుకోదగ్గ అద్దం ఈ లిఖిత పత్రిక' అని ప్రశంసించేవారు.

## కవిగా సాహితీలోక బలవర్ధకుడు

1968లో డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి, వంగపల్లి విశ్వనాథం, చక్రవర్తి వేణుగోపాల్‌లతో కలిసి ప్రచురించిన 'వీచికలు' తొలి కవితా సంకలనం.

ఆపై 1974లో డా॥నాగినేని భాస్కరరావుతో కలిసి ప్రచురించిన 'మేం' కవితా సంపుటి నాటికి ఒక సంచలన సంపుటి.

1983లోనే ఆకాశవాణి జాతీయ కవి సమ్మేళనానికి తెలుగు కవిగా ఎంపిక చేయబడి, తెలుగు కవిత్వం పదునునీ, పసందునీ జాతీయ సాహిత్యవేదికపై దీప్తిమంతంగా ఆవిష్కరించారు.

1990లో 'అగ్నిసుధ', 2010లో 'మనసు పావనగంగ', 2011లో 'చిత్రగ్రంథి', 2011లో 'కవి కాలమ్', 2020లో 'తెమ్మెర' కవితాసంపుటాలు వెలువడినాయి.

'అగ్నిసుధ' కవితా సంపుటి కలహంసి, ఉమ్మడిశెట్టి అవార్డుల్ని పొందింది.

'చిత్రగ్రంథి' సంపుటి సామాజికత, తాత్త్వికతల కలగలుపు కవితారేఖలతో కవిత్వప్రియుల్ని అలరించింది.




సమకాలీన సామాజిక అస్తవ్యస్తతని నిరసిస్తూ, అధిక్షేపిస్తూ, శక్తివంతమైన అభివ్యక్తినిస్తూ కవితానిర్మాణం సాగిస్తారు సుధామ. 'ఏడో క్లాసు పిల్లాడు మూడో క్లాసు పిల్లను రేప్ చేస్తాడు./ ఆనక అంచెలంచెలుగా దాదర్ ఎక్స్‌ప్రెస్‌లా ఎదుగుతాడు / రేపు వాడికి లాగులో / ఓ కొత్తఅవయవంలా కత్తి కూడా ఉంటుంది/ అని, 'బూతు మా జీవితం/ రక్తపాతం మా ఊపిరి/ సినిమా మా వేదాంతం' అని, 'ఇవాళ మనిషికి నవగ్రంథులు కాదు/ మరో కొత్త గ్రంథి/ చిత్రగ్రంథి' అని తన సంవేదనని కవితాత్మకం చేస్తారు.

'చిత్రగ్రంథి'లో మరో మెరుపు – ముక్తపదగ్రస్తం వంటి అలంకారాల్ని శక్తివంతంగా వచనకవితలో అర్థవంతం చేయటం. ఇదీ సుధామ ప్రయోగశీలానికి ఒక ఉదాహరణ!

'తెమ్మెర' కవితా సంపుటి సుధామ పరిణత, సామాజిక పరిశీలనకూ, మనిషి వర్తనరీతి వింగడింపుకూ, శబ్దచిత్ర ఆవిష్కరణగా కాంతిరేఖగా నిలిచింది.

'తెమ్మెర'లో వస్తు వైవిధ్యం, కవితాభివ్యక్తి విస్తృతీ– ఒకదానితో ఒకటి పోటీపడినై. ప్రపంచం పోకడ, నగరీకరణం, ఆధునిక జీవన దుస్థితీ దుర్గతులూ, వర్తమాన సమాజ సంక్షోభంలో కూరుకుపోయి చేతులెత్తి ఆక్రందిస్తున్న అసమాయుల వెతలూ... వరద బాధితుల ఘోషా, వలస బతుకుల అరికాళ్ల కిందినిప్పులూ, కరోనా విలయం, విద్య, వైద్యం, ఆహారం – కార్పొరైటీకరణ దుష్పరిణామం, పాలకపాలితుల ద్వంద్వనీతి... ఇలా... ఇన్ని కంటి మెరమెరల మధ్యనా, సుధామ మానవీయ భావనలు, హృదయ సౌందర్య దర్శనం, ప్రేమ భావనారాధన... ఇలాంటి భావోద్వేగాల అక్షరీకరణమూ జరిగింది – 'తెమ్మెర'లో. అది వడగాలిలో తూరుపుగాలి, మలయానిలంలోని ఆర్ద్ర స్పర్శ!

ఈనాటి మనిషీ, సమాజం కవి ముందుంచుతున్న బతుకు వైరుధ్యాల దృశ్యాన్ని '(అ)జ్ఞాతం' వంటి కవితల్లో చూపారు. విరటుని కొలువుని ఈనాటి సంఘ వేదికగా మార్చిన అద్భుతమైన కవిగా సుధామ ప్రజాస్వామ్య విశ్వాసి. 'ఎప్పటికైనా గెలిచేది/గణతంత్రమే /రణతంత్రం కాదు' అని జెండా పట్టుకుని చెయ్యెత్తి జై కొడుతున్నారు! కవితాసుధని జాలువార్చారు.

'తెమ్మెర'లోని ప్రాణశక్తి – నిజానికి బహుముఖీనమైన సుధామ సృజనశీలం నుంచే వచ్చి నిలిచిందనిపిస్తుంది. ఆయన అధ్యయనం, లోకాలోకనం, అనుభవం– కవిత్వ క్రియాశక్తిగా ప్రోదిగొన్నవి. అందుకే ఆయన భావాల్లో, భావనల్లో అంతసారళ్యం, వ్యక్తీకరణలో అంత మిత్ర సమ్మతీ!

'కవి కాలమ్' ఒక విలక్షణమైన, వినూత్నమైన ప్రయోగాత్మక కవిత్వావిష్కరణం. వర్తమాన, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ రీతీ రివాజుపై వ్యంగ్య పరంపర ఇది. ఆంధ్రప్రభ దినపత్రికలో మూడు సంవత్సరాలు వారం వారం ధారావాహిక శీర్షికగా ప్రచురణ పొందింది. ఎందరో కవి, పండిత, విమర్శకుల ప్రశంసలు లభించాయి.

విస్తృతమైన జీవితానుభవం కలిగిన రచయితగా సుధామ అనంతమైన వైవిధ్యాన్ని చూపారీ 'కవికాలమ్'లో. 'స్వదేహీ మారకద్రవ్యం', 'సమ్‌డాగ్ కలియనీరు', 'జనప్రాణహరణ జలం' వంటి అధిక్షేప రచనలతో పాటు, 'స్వరజ్యోత్స్న', 'శతజయంతి శంపాలత' వంటి ఎంతో గొప్ప అనుభూతి దాయకమైన అభినందన అక్షరగుచ్ఛాల్నీ ఈ కవితా మాలికలో కూర్చారు. శీర్షికాశిల్పంతోనే తమ ప్రతిభని వెలార్చారు సుధామ.

కవితని ఎత్తుకోవటంలోనే చదువరిని ఒక ఆలోచనావలయంలోకి ప్రవేశపెడుతూ మొదలెట్టే శక్తి సుధామది. చూడండి – 'బాధలేని సౌఖ్యం వద్దు' అనే కవిత ఇలా ప్రారంభమవుతుంది. 'సరికొత్తదే! కానీ ఇది ఒక సందిగ్ధసమయం/ అవ్యక్తచేతనలో/ అడుగులు వేసినట్లు / విచ్చుకున్న ఆశల హరివిల్లు వెనుక/ చిల్లుపడుతున్న మానవీయ / ఓజోన్ పొర...' భావం దుముకుతుంటే దాన్ని కవితామయంగా ఆవిష్కరించుకుంటూ పోవటంలో నేర్పరి, కవితాశిల్పమర్మజ్ఞుడు సుధామ. ప్రస్తుత దేశకాలమాన పరిస్థితుల్లో 'సుధామ స్పృశించని అంశమే లేదే'అని ముక్కున వేలువేసుకొనేట్టు మనముందు కొచ్చింది 'కవికాలమ్'. సంపుటిలోని అనంతమైన వస్తు విస్తృతికి, అద్భుతమైన కవితాభివ్యక్తి బంగారానికి తావి అలదినట్టుగా శోభిస్తోంది.

'గ్యాస్ ఫూల్స్ పేరడీ' 'ప్రశ్నా (స)మయం' 'వైద్యానికి నైవేద్యం' హా!.... కీ.. పోయిందే' 'శ్రీమద్‌మారాయణం' వంటి వ్యంగ్య శీర్షికాశిల్పమే సమాజ జీవనవిపర్యయాల్ని చిత్రపటాల్లాగా కళ్ళముందు ఆవిష్కరింపజేసింది.

'కాలమ్' వ్యాసరచయితగా సుధామ 15 సంవత్సరాలు ఆంధ్రభూమిలో నడిపిన సం.సా.రా.లు కాలమ్ తెలుగు పత్రికా ప్రపంచంలో సంచలనాత్మక విజయం. సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు వలయంలోని 360 డిగ్రీలపైని సంభవాల్నీ, ప్రాసంగిక సంఘటనల్ని – ఎంతెంతో ఆలోచనీయంగా, సంవేదనాత్మకంగా, వ్యాసనిర్మాణ శబలతతో, వస్తు నిర్దిష్టతతో... అనన్య సామాన్యమైన శైలీ సారళ్యమంతో ఈ వ్యాస వాహినిలో ఆవిష్కరించారు సుధామ.

'సుధామయోక్తి' కాలమ్‌ని 'మనతెలంగాణ' పత్రికలో మూడేళ్ళపాటు ఉత్కంఠతో నడిపి పాఠకుల్ని అలరించారు. అలాగే 'వసుధా(స)మయం' కాలమ్ 'విజయక్రాంతి' దినపత్రికలో ఒక ఏడాదిపాటు నిర్వహించారు.

అనితర సాధ్యమైన ఇతరాలు! ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో 'పూతరేకులు' (జోక్స్‌బాక్స్) హాస్యహేలగా చదువరుల మన్ననల్ని పొందింది.

పదబంధ ప్రహేళికలు, పజిల్స్ నిర్మాణ కౌశలంలో సుధామను మించిన తెలుగు రచయిత లేడంటే, అతిశయోక్తి కాదు. బహుశ, ఈ విషయంలో ఆయనది అప్రకటిత ప్రపంచరికార్డు! ఏడుగళ్ల పదబంద పారిజాతాలుగా ఒక వంద గళ్ళనుడికట్ల సంకలనంగా 'మాటాట'ని ప్రచురించారు. 'పదానందం' పేర తొమ్మిది గళ్ళ నుడికట్లను హాస్యానందం పత్రిక పుస్తకంగా ప్రచురించింది.

'జీవనసంధ్య' పేరిట వయోధికులకోసం 'వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్' మాసపత్రికలో సుధామగారు రాసిన ధారావాహిక వ్యాసాలను సంపుటీకరించిన గ్రంథం– మూడు ముద్రణలు పొందడం విశేషం! వయోధిక పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్న గ్రంథం అది.

కాల్పనిక సాహిత్య సృజనకారునికంటే వ్యాసకర్త అచ్చమైన కష్టజీవి. ఒక విషయాన్నో, గ్రంథాన్నో, రచననో ఆసాంతం చదవటంతో ఈ కష్టం మొదలు. దాన్ని ఆకళించుకోవటం, జీర్ణించుకోవటం, ఆ పైన ఆకరగ్రంథాల్ని సంప్రదించటం, ఉద్దిష్ట అంశాలకు తనవైన అభిప్రాయాల్నీ, ప్రతిపాదనల్నీ చెప్పటానికి మేధోమథనం – ఇలా ఆ ప్రక్రియ అంతా కష్టభూయిష్టమే. ఇంత శ్రమనీ, నిబద్ధతతో బాధ్యతగా చేసి తన వ్యాసాన్ని ఒక ప్రామాణిక దర్శనంగా అందించే చింతకుడు సుధామగారు.

వ్యాసకర్త సుధామ లోకాన్ని చూడడంలో మాత్రమే కాక, తెలియడంలో గవేషణాత్మకుడు. సంగీత సాహిత్య సాంస్కృతిక కళా వైజ్ఞానిక రంగాల్లో అభినివేశం ఉండటం ఒక ఎత్తు. సుధామలా నిమగ్నతనీ, నిబద్ధతనీ, పరిణతినీ సాధించటం మరొక ఎత్తు. ఈ 'ఎత్తు'కు సాధన కావాలి. ఒక్కొక్కప్పుడు వ్యక్తిగత సుఖత్యాగం కావాలి. వాటిని గడించుకొన్న కళోన్మత్తుడు సుధామ. అందుకనే, ఆయన వ్యాసాల్లో వైవిధ్యం, అపూర్వమైన విస్తృతీ, విలక్షణత, విషయసాంద్రత ఎంతో గాఢంగా ఉన్నాయి. ఆయన శ్రీమతి అల్లంరాజు ఉషారాణి (ఆకాశవాణి శిక్షణా సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్) సంపాదకత్వంలో 2018లో వెలువడిన 'భూమిక' సంపుటిలోని వ్యాసాల్లోనే పైన పేర్కొన్న సుధామ గుణవిశేషాల్ని చూస్తాము.

ఆంధ్రభూమి భాషా విషయిక శీర్షికగా 'నుడి'ని నిర్వహించింది. ఆ శీర్షికలో ఆకాశవాణిలో యువవాణికై సుధామ రాసిన 13 వ్యాసాల్ని 'తెలుగు సొగసులు' పేర యువభారతి సంపుటిగా ప్రచురించింది. ఇవన్నీ విద్యార్థి యువతకు భాషాసాహిత్య పరిచయవ్యాసాలు.

కాగా, వ్యాసకర్తగా సుధామ దశాబ్దాల కృషి ఫలంగా, వెలువడిన రెండు బృహత్సంపుటాలు – 'సందర్భ' 'కాలం వెంట కలం' – రెండూ సుధామ సప్తతి జన్మదిన సందర్భంగా ప్రచురింపబడినవి.

## 'సందర్భ' 76 సాహిత్య వ్యాసాల ఆకరగ్రంథం.

'సందర్భ'లో కొన్ని పరిచయస్పర్శలూ, కొన్ని పరామర్శవ్యాసాలు, కొన్ని సమీక్షా సంభాషణలూ, కొన్ని విమర్శా విశ్లేషణల పాఠాలూ, ఇంకా కొన్ని మనఃపూర్వక నివాళులూ ఉన్నాయి. వెరసి ఇవన్నీ ఒక సారస్వతానుగామి 'పద' కదలికలు!

'మరువకూడని బంగారిమామ' అన్నారు కొనకళ్లని. పరిచయ పునశ్చరణ వ్యాసం. 'కదిలేదీ, కదిలించేదీ' – కవిత్వమే కదా! దాని ప్రేరకశక్తినీ, చోదకశక్తినీ ఉగ్గడిస్తూ – పి.వి.నరసింహారావు, కాళోజీల ఉదాహరణల్ని ఇచ్చారు. మంచి 'లో' చూపునందించే వ్యాసం.

చెప్పవలసింది చెప్పే తీరాలన్న వాంఛనీయమైన నిబద్ధత సుధామగారి వ్యాసరచనలో చాలా చోట్ల గమనిస్తాము. ఈ నిరపేక్ష దృష్టి వారి విమర్శకు వివేచనని ప్రోది చేస్తున్నది. 'రసవాయువు ద్రవించే ఘనకవిత్వ కుమారుడు' వంటి శీర్షికల్లోనే ఆయా గ్రంథాల సొబగును తెలిపే గడసరి సుధామ. సుధామలోని పరిశీలనాదృష్టికీ, అధ్యయన గాఢతకీ, విశ్లేషణా సమర్థతకీ దృష్టాంతాలుగా సందర్భలోని వ్యాసాలు నిలుస్తాయి.

గురజాడ, పానుగంటి, శ్రీశ్రీ, మధునాపంతుల, కుందుర్తి, అవసరాల రామకృష్ణరావు, బాపు, వేటూరి, ఆత్రేయ, పోతుకూచి, శ్రీకాంతశర్మ, కె.బి.లక్ష్మి వంటి ప్రముఖుల సాహితీ వరివస్యని సమీక్షాపూర్వకంగా అంచనావేస్తూ రాసిన వ్యాసాలు ముప్ఫైకి పైనే ఉన్నాయి – ఈ 'సందర్భ'లో. ఆయా ప్రముఖుల వ్యక్తిత్వం, సాహిత్య వ్యక్తిత్వం– ఈ రెంటినీ సమన్వయించి, వారి వారి ప్రత్యేకతల్ని, వారు సాహిత్యానికి అందించిన సొంత 'ముద్ర'ని పాఠకునికి చేరవేయటం సుధామగారి రచనా శిల్పానికి గల ఒక మెరుపు.

శతక సాహిత్యం మీద, శ్రీ పదచిత్ర రామాయణం పైని, సామయిక కవిత్వం గురించీ, అభిలాషలో సాహిత్య అస్తిత్వం మీద – సుధామగారి వ్యాసాలు విషయపరంగా విలువైనవి, ఆలోచనీయమైనవి.

'సందర్భ'లోని కొన్ని వ్యాసాలు మరీ అపూర్వమైనవీ,

(మిగతా 4వ పేజీలో..)












# ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ సోదాలు..

నిజామాబాద్, మార్చి 12:నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారం ప్రాంతంలో గల ఆర్టీఏ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఏసీబీ అధికారులు దాడులు చేపట్టారు.

ఈనెల 3న సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేయగా, ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రర్ ఘటన మరవకముందే బుధవారం ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ దాడులు జిల్లాలో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కార్యాలయంలో దాడులు కొనసాగుతున్నాయి. త్వరలోనే పూర్తి వివరాలు ఏసీబీ అధికారులు వెల్లడించనున్నారు.

# రెండు బస్సులు డీ -ఇద్దరు దుర్మరణం

అమరావతి, మార్చి 12:అన్నమయ్య జిల్లా, కర్ణాటక సరిహద్దులో ఇవాళ తెల్లవారుజామున రెండు ప్రైవేటు బస్సులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మరణించారు..రాయల్పాడు సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 40 మంది గాయపడ్డారు.

స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లారు.సహాయక చర్యలు చేపట్టి.. హుటా హుటినా క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. క్షతగాత్రులకు కోలార్, శ్రీనివాసపురం, మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1397వ రోజు 'ఒక్క రేడియో- వేల ఆనందాలు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'ఒక్క రేడియో- వేల ఆనందాలు' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు



*మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం*
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
*-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839*

## చెలికత్తె

ఉదయాన్నే
భక్తిగీతాలతో ఉషోదయం
ఆ వెంట ఆపాతమధురాలు
నవరసాలు నిండిన గీతాల్లో
ఇమిడిన సాహిత్యాన్ని
చెవులకు చేరవేస్తూ.
ఇంటిపనుల వేళ
శ్రమను మరిపించే
నేపథ్య సంగీతమౌతూ
ఆందోళన కలిగినవేళ
ఆనందాన్ని అందిస్తూ...
అలసినవేళ
సాంత్వన చెందిస్తూ.
నిర్లిప్తతలో మునిగిన వేళ
చైతన్యాన్ని రగిలిస్తూ
ఉదాసీనంగా ఉన్నవేళ
హుషారు పుట్టిస్తూ.
పదే పదే వచ్చే
పనికిమాలిన జ్ఞాపకాలను
దారిమళ్లిస్తూ
చిన్నపాటి రుగ్మతలకు
ఔషధంగా పనిచేస్తూ.
చిన్ననాటి నుండీ
నా చెలికత్తెలా
వెన్నంటి ఉంటున్న నీతో
రోజంతా
సుదీర్ఘంగా సంభాషిస్తూ నేను!!.

-చంద్రకళ దీకొండ

## ప్రయాణ నేస్తం

ఉదయ వాద్యగానం
హృదయాన్ని తాకగా
సుప్రభాతమూ భక్తి రంజనీ
మైమరపింపజేస్తాయి.
ఆకాశవాణితో
శ్రోతల మరువలేని బంధం
సూక్తి ముక్తావళితో పాటు
ఎన్నెన్నో గొప్ప కార్యక్రమాలు
మధ్యలో వార్తలు.
ఒక పద్ధతి ప్రకారం
చక్కగా సుగంధ భరిత
మనోహరం గీతాలు
మహిళల కార్యక్రమాలతో
ఆటవిడుపు.
బాలల చిలుక పలుకులు
గానాలు,సంగీతం,గీత కచేరీలు
మహామహుల బోధలు
కవి సమ్మేళనాలు
ఎన్నని చెప్పాలి!
వర్ణించేందుకు అద్భుతం
ఆకాశవాణి
అపురూప వాణి
నేడూ ఎక్కడెక్కడో వినిపిస్తుంది
కార్లలోనూ ఫోన్లలోనూ
ప్రయాణ నేస్తం.

- కె.కె.తాయారు

## నాటి మీడియా

ఆ.వె. రేడియోలు నాడు రేయింబవళ్ళను
రాగమెత్తిపాడె రమ్యముగను
విశ్వమంతగూడ వినుచు నానందించి
పరవశించి పోయె నిరతముగను!.
ఆ.వె. బాల గేయములకు భక్తి పాటలకును
పేరుగాంచె నిలను పెద్దగాను
వార్తలెపుడు చెబుతు కీర్తి గాంచెనిదియు
రేడియోలెపుడు మీడియాయె!.

-జక్కని గంగాధర్

## ఇంటిల్లిపాదికి పండగే

యాభైలలో
రేడియో కొన్నారంటే శ్రీమంతులే
ఇంటిల్లిపాదికి పండగే
ఇంటిచుట్టు వారంతా
నాటికలకు
శబ్ద చిత్రాలకు
అతుక్కుపోయేవారు.
వారాంతంలో
పండగలూ పబ్బాల్లో
పిల్లల కార్యక్రమాలకు
పాటలకు ప్రత్యేక ఆకర్షణ.
కాలప్రమాణాలతో వార్తలు
ఇటు హైద్రాబాదు నుండి
అటు ఢిల్లీ నుండి అందుబాటై
శ్రోతలకు విజ్ఞాన పంపిణీ.
క్రికెట్ కామెంటరీకి ఊతమై
ఎక్కడో దేశాలలో జరిగే
ఆటల తాజా వార్తలతో
వేల మందికి
ఉత్సాహ ఉల్లాసాలు.
కాలప్రవాహంలో
కొత్త కొత్త ఆవిష్కరణలతో
దృశ్య శ్రవణ మాధ్యమాల రాగాలతో
కొంత వెలితి రేడియో ఆదరణలో.
అయినా ఇప్పటికి
ఎఫ్ ఎం రేడియో
రేడియో యాప్ లతో
కొల్పోని ప్రాభవం.

- నగునూరి రాజన్న

## నా వ్యక్తిగత సహాయకురాలు

కర్ణుడికి కవచకుండలాల్లా
నాకు రేడియో జేబులో
పాఠశాల రోజుల నుండి
క్రికెట్ స్కోర్ తెలిపేది నేనే.
సిలోన్ బ్రాడ్ కాస్టింగ్ నుంచి
అన్ని రేడియో స్టేషన్ల
పాటల ప్రోగ్రాంలన్నీ
వింటేనే
ఆకలి హరణం
ఆ రోజు ఉపవాసమే.
పరీక్షల సమయానికి
నాన్నచేసిన
బాటరీల మాయతో
పరీక్షలు హిట్
లేదంటే ఫట్
నాన్నకుజై
రేడియోకు జై జై.
ఆదివారం సంక్షిప్త శబ్ద చిత్రం
ఒక రేడియో - ఎందరో శ్రోతలు
ఎన్నో రేడియో స్నేహాలు
ఈ మాసం పాటల పోటీలు.
రేడియోతో రోజు మొదలు
రేడియోతోనే శుభరాత్రి
వ్యాఖ్యానం
అనుకరణ
సంగీతం
సాహిత్యపిపాస
మొత్తంగా
నా వ్యక్తిత్వనిర్మాత నుంచి
నా వ్యక్తిగత సహాయకురాలై
నాటికీ నేటికీ
నాతోనే నా రేడియో.

-ప్రశాంతి రేవూరి

## మాట పాటల పెట్టె

సంగీతం, వార్తలు, ప్రసంగాలు
పంతొమ్మిది వందల ఐదులో ప్రారంభం
పంతొమ్మిది వందల ఇరవై మూడు నుండి
వాణిజ్యపరంగా ప్రసారాలు
బొంబాయి రేడియో క్లబ్ నుండి
దేశంలో మొదటిసారి ప్రసారాలు
మద్రాసులో ప్రారంభమైన
రేడియో స్టేషన్ ద్వారా
తెలుగులో ప్రసారాలు
పండిట్ నరేంద్ర శర్మ సూచన మేరకు
ఆల్ ఇండియా రేడియో పేరు
ఆకాశవాణిగా మార్పు
ఆరంభ సమయంలో
కొన్ని కార్యక్రమాలకే పరిమితం
క్రమక్రమంగా పదిహేడు గంటల పాటు
వివిధ రకాల ప్రసారాలు
నా చిన్నప్పుడు
బుల్లి పెట్టెలో నుండి
మాటలు పాటలు వింటూ
అబ్బురపడ్డాను
ఆదివారం నాటకం కోసం
ఎదురు చూశాను
వార్తలు చిత్రలహరే కాకుండా
పిల్లలకు రైతులకు కూడా
ప్రత్యేక కార్యక్రమాల ప్రసారాలు
రేడియో ప్రసారాల్లో
పాల్గొనే వారి పేర్లు
ఎందరికో సుపరిచితం
చిత్రం కనపడకపోయినా
మన ఎదురుగా
మనతో మాట్లాడినట్లే
చెప్పాలంటే అనేక కార్యక్రమాలతో
రేడియో మనకు మంచి నేస్తం.

## స్వర మాధుర్యం

ఏ యుగమైనా
ఏ కాలమైనా
ఏ దశాబ్దమైనా.....
నిశ్శబ్ద రాత్రిని సంగీతంతో నింపి
నెమ్మదిగా మదిని ఆలింగనం చేసే
ఓ మధుర స్వర మాధుర్యం
రేడియో!.
పూర్వ కాల జ్ఞాపకాలు
అలనాటి సుమధుర గీతాలు
చిట్టి చిట్టి పంచతంత్ర కథలు
అలరిస్తాయి చిన్నారుల మనస్సులు.
కనపడని మనిషి
వినిపించే స్వరం
నమ్మకం పెంపుదల
జ్ఞాన వికాసం.
ఉపశమనం అలసిన మదికి
కోట్ల ఆనందాల పంపిణీ
దేశదేశాల సమాచార వ్యాప్తి
అదే మన రమ్యమైన రేడియో.

-డా.రమ్యాస్వరూప్

## ఆలోచింపజేసేది

ఉదయకాలపు ఉషోదయకాంతి
మేనిని తాకిందన్నంతా హాయిగా
శ్రవణానందాన్ని సొంతం చేస్తూ
తియ్యటి రాగాలాపనతో
అలసటన్నది తాకనివ్వక
మధ్య మధ్యలో
మాటల మూటలు విప్పుతూ
జగమంతటిని చుట్టి
నవ్వతకు చోటిచ్చి
నవరసాలు పలికించే రసమయి.
కాలమేదైనా
తదనుగుణంగా ఒదిగిపోతూ
తన ఉనికిని చాటుకుంటూ
మరుగున పడనీయకుండా
తట్టి లేపుతూ
పోటీ ప్రపంచంలో తన స్థానానికి
సాటి లేదంటూ
స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ...
వ్యవసాయమైనా మరే విద్యయైనా
ఒక్కటేమిటి సమస్తం
తనతోటే ప్రపంచానికి
వినిపించిన మాటకారి.
సృజనాత్మకత మాధ్యమంగా
కళారూపం సృజియించాకా
నాటకం మొదలు
సంగీతం చర్చా హాస్యం
ఎన్నెన్నో ప్రసారాలు
ధ్వనిని ఊహాత్మకంగా మార్చినా
ఎన్నోఏండ్లు గతంలో కలిసినా
శ్రోతలకు మాత్రం
తన రాక నేటికీ అద్భుతమే!.
ఒకరి కృషి ఎందరికో ఆనందంగా
అంతులేని ఆలోచనల అమలుతో
అజరామరమైన
వారధిని కొనసాగిస్తూ
కాలగమనంలో
మారిన రూపాలెన్నో అయినా
అంతరంగ ఆశయ
కొనసాగింపే దిశగా కొందరు శ్రమ.
నేడు చేతికొక స్మార్ట్‌ఫోన్ ఉన్నా
ఆనందం కరువు
ఒంటరితనాన్ని పోగేసుకుంటూ
నవ్వడమే మర్చిపోయిన జీవితాలెన్నో
ఒకప్పుడు..
ఒక్క రేడియో ఇంటిల్లిపాదిని
ఆనందింపజేసేది
ఆలోచింపజేసేది.
తరంగాలతో
స్వర మాధుర్యాన్ని పంచి
అభిమానుల హృదయాల్లో
చెరగని స్థానాన్ని సంపాదించి
నేడు వేల ఆనందాలు
సొంతం చేస్తోంది రేడియో.

- శ్రీలతరమేశ్ గోస్కుల

## వస్తావా నేస్తం?!

సుప్రభాత వేళ
ఇప్పటికీ చెవులకు
ఏదో దివ్యలోకం నుండి
వినవస్తున్నట్టు
ఏకీకృత స్వరాన వినిపించే
'వందేమాతరం' బృందగానాన్ని
ప్రతిరోజూ వినిపించిన మిత్రురాలు.
"ఆకాశవాణి-
వార్తలు చదువుతున్నది
కొంగర జగ్గయ్య
అద్దంకి మన్నార్
కందుకూరి సూర్య నారాయణ
మామిళ్లపల్లి రాజ్యలక్ష్మి అంటూ
వార్తలంటే ఆసక్తి పుట్టించిన
ఆకాశవాణి.
ఆదివారం నాడు
"రారండోయ్" అంటూ
ఆత్మీయతతో దగ్గర కూర్చోబెట్టుకుని
కథలూ,కబుర్లూ చెప్పిన నేస్తం.
చిన్నక్క, చిన్నన్న లు కలిసి
కార్మికుల కార్యక్రమాన్ని
విజ్ఞాన వంతంగా
వీనుల విందుగా వినిపించిన రేడియో.
ఉషశ్రీ రామాయణాన్నీ
కరుణశ్రీ పుష్పవిలాపాన్నీ
ఘంటసాల లలిత గీతాలనూ
భగవద్గీతనూ
శ్రావ్యంగా వినిపించి
నాలోని మానవతా విలువలను
సాహిత్యాభిలాషను
పెంపొందించిన
నెచ్చెలి సాహితీ కేంద్రం.
ఘంటసాల, సుశీలల
యుగళగీతాలను
జానకి, భానుమతుల
మధురమైన పాటలను
మనసారా వినిపించిన ఆకాశవాణి.
పుట్టింటి మధుర స్మృతి రేడియో!
సాంకేతికత విశ్వరూపం దాల్చిన
ఈనాడు కూడా
చిన్న చిన్న ఊళ్ళకు
రేడియో సిగ్నల్స్ రావని
తెలిసి బాధపడని రోజు లేదు
వీలు చేసుకుని
దారి తెలుసుకుని
మా పిఠాపురానికి
వస్తావా నేస్తం?ప్లీజ్!.

-ముద్దు వెంకటలక్ష్మి

## అంతటా!

అంతటా విన్పించే మాటలతో
బులిపించు పాటల్తో
మరిపిస్తుంది
బొద్దుగా ముద్దుగా బుద్ధిగా
బల్లపై ఆసనం
మీట నొక్కితే నవరసాల రసాలు
అన్ని భాషల్లో
అరమరిక లేని భేటీ
రేడియో అమ్మాయీ!
నీకు నీవే సాటి
తెల్లార్తూనే తాతగారితో స్తోత్రాలు
నాన్న కోసం అసలు సిసలు వార్తలు
ఊసుపోని వారికి
కమ్మనైన మాటల పాటల
విందు బహుపసందు.
బహుజనహితాయ
బహుజన సుఖాయ
పరీక్షాపే చర్చతో
గల్లీ నుంచి ఢిల్లీ దాకా
బాలల వత్తిడికి పూర్ణ విరామం
నెలనెలా మనసులో మాటతో
కలాలకు గళాలకు ఆశలు.
ఒంటరి హృదయానికి
తుంటరి మనసుకి
పిల్లలు మొదలు పెద్దలదాకా
సుద్దులు బుద్ధులు
స్పష్టత క్లుప్తత
నిబద్ధత క్రమశిక్షణ
సమయపాలనతో
చెట్టుకింద కారులో మనవెంటే
పెట్టదు తంటా.
కోపమొచ్చి మొట్టినా
కిక్కురుమనదు
నోరు మూసి మౌనిలా
కదలక మెదలక ఉండే నిండుకుండ
మిటమిటలాడే ఎండలో
గడగడ మాటల వసపిట్ట
చుక్క నీరు అడగని
గరంచాయ్ గుటకేయని
రైతన్నలకి నేస్తం.
పర్యావరణ పరిరక్షణ లో
ప్రకృతిమార్పుల విశ్లేషణ
సూర్య కాంతితో పోటీ
అశరీర ఆకాశవాణి
విడివిడిగా
కలివిడిగా
ఆందోళన లేకుండా
చిత్తశాంతి
తొలగిస్తుంది భ్రాంతి
చరవాణి చెర వద్దు
రేడియోనే ముద్దు.

-ఎ.రాజ్యశ్రీ

## బుల్లి పెట్టె!

మాటల పేటి ఇది
మాయా మర్మం తెలియనిది
మంత్రం వేసేస్తుంది
మనసును దోచేస్తుంది.
సుప్రభాత వేళలో
శుభమస్తంటూ
భక్తి భావవిలసితతత్వంతో
ప్రశాంత శాంత సత్సంగంతో
మదిలో కోవెల జేగంటలతో.
వినోదాలకు విందౌతుంది
ఉత్సాహోల్లాసాలతో
లలిత గీతాల సరస రాగాల
ఊయలలో ఓలలాడిస్తుంది
సంగీత సాహిత్య సౌరభాలతో
మనసు మెప్పిస్తుంది..
మనోరంజని
మధుర దరహాసినియై
అన్నదాతకు
సిరి పంటల సౌభాగ్యాలను
అందిస్తూ
నాటక రూపక
గద్య పద్య స్వరగంగలో ముంచేస్తూ
విద్యల ఆలయమై
రెక్కల చాటున
గువ్వ పిట్టలా ఒదిగిపోతుంది.
పేదా గొప్పా తేడాలస్సలే లేవు
బుల్లి పెట్టెకు
కబుర్లు మోసుకొస్తుంది
వింతల విడ్డూరాలతో
వార్తాహరిగా
సంగీత లహరిగా
వినసొంపుగా
శ్రమను మరిపిస్తుంది
సన్నాయి రాగంతో
రేతిరి పొద్దుల్లో
జోల పాడుతానంటుంది
తీయని కలలతో నిద్దురలో.

-పి.పద్మావతి

# చెడుపై మంచి విజయమే హోలికా దహనం, హోలీ పర్వదినం

హోలికా దహనం (చోటీ హోలీ) చెడుపై మంచి లేదా రాక్షసత్వంపై మానవత్వం గెలిచిన రోజుగా హిందూ సమాజం భక్తిపూర్వకంగా మహదానందంతో జరుపుకున్నారు. జీవితంలో అహంకారం దుష్టశక్తుల రూపంలో వచ్చే కష్టనష్టాలనే చీకట్లను కాల్చి వేస్తూ భక్తి, దేవుడిపై నమ్మకం, మంచి వెలుతురు వైపు నడిచే రోజుగా హోలికా దహన పర్వదినాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. 13 మార్చిన రాత్రి ప్రదోష వేళల్లో హోలికా దహనం, 14 మార్చి ఉదయం హోలీ రంగుల పండుగను జరుపుకోవడం కొనసాగుతూ వస్తున్నది. ఒడిసా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో హోలీకి ముందు రోజు "డోల్ పూర్ణిమ" వేడుకలను జరుపుకుంటూ కృష్ణుడు, రాధల విగ్రహాలను తీసుకువచ్చి, రంగు ధూళితో మసకబార్చి, వీధుల నిండా ముగ్గులు వేసి పర్వదిన ప్రేమామృత సారాన్ని ఆస్వాదిస్తారు.

### హోలికా (భోగి మంటలు) దహన పర్వదినం:

హోలికా దహనంతో దుష్టశక్తులు, వ్యాధుల వ్యాప్తి, ఆర్థిక ఇబ్బందులను కాల్చి బూడిద చేసే మంటలుగా హోలికా దహనాన్ని నిర్వహిస్తూ ఎండు కర్రలు, పిడకలు, ఎండు ఆకులు లాంటివి వేసి మండిస్తూ, ఆ మంటల చుట్టు సంతోషంగా నాట్యాలు, ప్రదక్షిణలు/ప్రార్థనలు చేయడం, హోలికా బొమ్మను మంటల్లో వేసి దుష్టశక్తులను దహనం చేయడం సాంప్రదాయంగా వస్తున్నది. ఈ మంటల వెలుగులకు టెంకాయలు, గోధుమలు, చెరుకు గడలు, కర్పూరం, బుక్కగులాలు లాంటివి సమర్పిస్తూ మంటల చుట్టు భక్తితో ప్రదక్షిణలు చేస్తారు. పుష్కలంగా పంట దిగుబడి రావాలని, చీడపీడలు తొలిగి పోవాలని రైతులు వేడుకుంటారు. హోలికా మంటలు పర్యావరణ శుద్ధికి, వ్యాధి కారక చెడు సూక్ష్మజీవుల దహనానికి, ఆ బూడిదను ఒంటికి పూసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరగడానికి కూడా సహకరిస్తాయని నమ్ముతారు. చలికాలం పోతూ వసంత రుతువు ఆగమనానికి గుర్తుగా కూడా ఈ పండుగను పరమానందంతో భక్తిపూర్వకంగా వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.

### హోలికా దహనం, ప్రహ్లాదుడి రక్షణ:

హిందూ పురాణశాస్త్రాల ప్రకారం ప్రహ్లాదుడు, హిరణ్యకశపుడి కథను మూలంగా తీసుకొని వివరించడం జరుగుతుంది. క్రూరత్వం కలిగిన హిరణ్యకశపుడనే రాక్షస రాజు తానే భగవంతుడినని, తనను మాత్రమే అందరు పూజించాలని ప్రజలపై ఒత్తిడి తెస్తాడు. అతని సుపుత్రుడైన ప్రహ్లాదుడు విష్ణు మూర్తి భక్తుడిగా జపం చేస్తూ, తండ్రి మాటలను పెడచెవిన పెడుతూ భగవాన్ విష్ణువు భక్తిలో మునిగి పోతాడు. తన కూమారుడిపై ఎంత ఒత్తిడి లేదా ఎన్ని బాధలు పెట్టినా విష్ణు జపం మానకుండా తండ్రి కోపానికి గురి అవుతాడు. హిరణ్యకశపుడి సోదరి హోలికాకు అగ్నిని తట్టుకునే ప్రత్యేక వరం ఉంటుంది. దానిని ఆసరాగా చేసుకొని ప్రహ్లాదుడిని తన ఒడిలో కూర్చోపెట్టుకొని మంటల్లో దిగాలని హిరణ్యకశపుడు కోరుతాడు. అలా ప్రహ్లాదుడితో పాటు హోలిక కూడా మంటల్లో కూర్చోవడంతో చెడు బుద్ధి ప్రదర్శించిన హోలికా ఆ మంటల్లో దహనం కావడం, సద్బుద్ధిగల విష్ణు భక్తుడైన ప్రహ్లాదుడు సురక్షితంగా బయట పడడం జరిగింది. అందు వల్ల హోలికా దహనం రోజున మంటల్లో హోలికా బొమ్మను కూడా దహనం చేస్తూ చెడును పారద్రోలడం ఒక సదాచారంగా వస్తున్నది.

### హోలీ రంగుల పర్వదినం:

హిందూ సమాజంలో హోలీ పండుగకు ఎంతో ప్రత్యేకత ఉన్నది. భారత్‌లో ప్రతి ఏట ఫాల్గుణ మాస పౌర్ణమి పుణ్య గడియల్లో మార్చి 14, 2025న పెద్ద ఎత్తున నిర్వహించుకోవడం జరుగుతున్నది. హోలీ పండుగ ముందు రోజు 13 మార్చి 2025న హోలికా దహనం నిర్వహిస్తారు. హోలీ పండుగ రోజు సరదాగా రంగులు చల్లుకుంటూ ఆనందంగా అందరూ కలిసి సంబరాలను చేసుకుంటారు. చెడుపై మంచి విజయం, శీతాకాల ముగింపును హోలీ సూచిస్తుంది. పంట దిగుబడులకు కృతజ్ఞతాపూర్వకంగా కూడా ఈ పర్వదినాన్ని ప్రజలు సంతోషంగా జరుపుకుంటారు. హోలీ రోజు ఉదయం రంగు పొడులను పూసుకోవడం, స్వీట్లు పంపిణీ చేసుకోవడం, భంగ్ లేదా తండై తాగడం, పలు రకాల స్నాక్స్ తినడం, నృత్యాలు చేయడం, రోడ్ల వెంట, ఇంటి ముందర, ఊరువాడల్లో బంధువులు, స్నేహితులు సప్తవర్ణాల రంగులను చల్లుకుంటూ, డప్పు వాయిద్యాల నడుమ నీటి తుపాకులతో రంగు నీటిని పిచికారీ చేసుకుంటూ ప్రజలంతా సమూహాలుగా చేరి పరమానంద భరితంగా పర్వదినాన్ని ఆస్వాదిస్తారు. హోలీ సంబరాల అనంతరం స్నానాలు చేసి సాయంత్ర వేళల్లో బంధువుల ఇళ్లకు వెళ్లి పెద్దలకు పాదాభివందనం చేస్తూ ఆశీర్వచనాలు పొందుతారు.

మనలో దాగిన చెడు ఆలోచనలు, ప్రతికూల భావాలను హోలికా లేదా భోగి మంటల్లో దహనం చేస్తూ మంచి బాటన నడవడానికి నేడే శ్రీకారం చుడదాం, ఇతరుల దురాలోచనలను సహితం అగ్నికి అర్పిస్తూ, రంగుల పండుగ మన జీవితాల్లో ఆనందాలు నింపాలని కోరుకుంటూ, సద్గుణ సమాజ స్థాపనకు పూనుకుందాం, సమాజ శాంతికి గొడుగులు పడదాం.

(13 మార్చి "హోలికా దహనం", 14 మార్చి "హోలీ పర్వదినం" సందర్భంగా)



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## చమ్మకేళిల హోలీ

నాడు అతనొక్కడే
ఆకుకు అందకుండా
పోకకు పొందకుండా
పగలుకాని రాత్రికాని
ఇంటిలోపలకాని బయటకాని
భూమిపైన ఆకాశంలో కాని
అస్త్రములు సస్త్రములచే
చావులేకుండా
స్వర్గం భూమి పై దాడిచేసిన
దురహంకారుడు దానవుడు
దేవతలచే దహనం చేయబడిన
వైనం వేనోళ్ల నేటికీ వింతగా
వినబడుతూనే వున్నా
వినబడని జాజిరాటల సవ్వడిలో
వసంతోత్సవం వందరంగులతో
వేలజీవితాల్లో ఇంకా వెలుగులు
నింపకనే నింపాదిగ నడుచుకుంటూ
వస్తోంది ఏడాది చివర
ఎడారి జీవితాల్లోకి ఫాల్గుణ మాసాన
నేటికీ అలాంటి హోలికాసురులెందరో
మన చౌరస్తా ల్లో చార్ సౌ బీస్
గాళ్లందరితో కలిసి
కళ్లముందే తిరుగుతున్నా
కళ్లజోడు ధరించి మనం
కామదహనం మరిచి
కాలం వెళ్లబుచ్చుతున్న తీరు
కలికాలంతో
సరిపెట్టుకుంటున్నాం
చూడు చూడు!!



-కాంచనపల్లి రామసుగుణాకర్ రాజు
9849375831

## రంగులమయం

పెళ్లిచూపుల్లో ఆమెవంక చూసినపుడు
ఏ వంకా పెట్టలేకపోయాను..
ఒళ్లంతా తెలుపు .. కురులు నలుపు
పెదాలకు ఎరుపు.. పాదాలకు పసుపు
బుగ్గలు గులాబీ.. కంఠం కింద గంధం
కట్టిన చీర నీలం.. దానంచు ఆకుపచ్చ
రవిక కాషాయం.. గోళ్ల రంగు ఊదా
ఇన్ని వర్ణాల మేని ఒక ఇంద్రధనస్సు
తాళి కట్టిన నాకు నిత్యం హోలీ పండగే!



-శర్మ సీహెచ్.,
చరవాణి: 9440587567

## పూలపుణ్యం

చెట్లకు పూస్తాయి
కళ్ళను కట్టేస్తాయి
మొగ్గతొడిగి మురిపిస్తాయి
విచ్చుకొని విస్మయపరుస్తాయి.
రంగులు అద్దుకుంటాయి
హృయలు పోతాయి
షోకులు చూపుతాయి
సౌరభాలు వెదజల్లుతాయి.
మాలగ మార్చబడుతాయి
సిగలన సింగారమవుతాయి
కొప్పులు ఎక్కుతాయి
కోమలులను కుషీపరుస్తాయి.
గుడికి చేరుతాయి
దేవుని కొలుస్తాయి
ప్రేమికుల చేతులుమారుతాయి
ప్రేమను వ్యక్తపరుస్తాయి.
సత్కవులను సన్మానిస్తాయి
వధూవరులను వేడుకపరుస్తాయి
పూలు మదులనుదోస్తాయి
విరులు మరులుకొల్పుతాయి.
పూలుచేసుకున్న పుణ్యం
వర్ణనాతీతం
కవులకిస్తున్న ప్రేరణం
శ్లాఘనీయం.



-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

## వసంత కేళి రంగుల హోలీ



హోలా హోలాల హోలీ రంగ హోలీ
జనుల హో హోల కేళీల హోలీ
హోలీ హోలాలి యశోద కృష్ణ డోలి
మా గుండెల్లో నిలవాలి ఆనంద కేళీ
ఉల్లాసంగా ఊరంతా వసంత మాడాలి
ఇంద్ర ధనస్సు రంగుల్లో మనమంతా తడవాలి
సప్త రంగులన్నీ కలిసి ఏకమవ్వాలి
నీరంతా జలధిలో కలిసినట్టు ఒక్కటవ్వాలి
హోలిక బూడిదయ్యింది మంటల్లో కాలి
వేమన యోగి అయ్యె తాను భోగము వదిలి
మన్మథుడు ముక్కంటి క్రోధాగ్నిలో కాలి
భస్మం బయ్యె ప్రాణాలు వదిలి
స్తంభించె లోకాన కామతాపాల కేళీ
పూల భానుడు లేక లేదు మదనకేళీ
రతీ దేవి ప్రార్థించె భర్తప్రాణాలు శివుని దయకు వదిలి
బతికె మన్మథుడు అశరీరుడై దేహము వదిలి
ప్రకృతి పులకింతల రంగుల చమకేళీ
మదనోత్సవములో మునుగుచుండె జనావళి
ఇది వసంత కేళీ రంగుల చమకేళీల హోలీ
(మార్చ్ 14, హోలి సందర్భంగా)



-పి.బక్కారెడ్డి
9705315250

# ఫీజు రీయింబర్స్ మెంట్ పై మండలిలో రచ్చ

## -సభ కార్యక్రమాలకు అడ్డుపడ్డ వైసిపి

అమరావతి, మార్చి 12: విద్యారంగ సమస్యలపై వైసిపి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని మండలి చైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించడంపై ఆ పార్టీ సభ్యులు ఫైర్ అయ్యారు..

వాయిదా తీర్మానంపై చర్చకు వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పన , ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై నినాదాలు చేశారు. అంతే కాకుండా చైర్మన్ పోడియం వద్దకు దూసుకెళ్లి ప్లకార్డులతో నిరసనకు దిగారు వైసీపీ ఎమ్మెల్సీలు. దీంతో సభలో రచ్చ చోటు చేసుకుంది.

వైసీపీ ఆందోళనపై మండలిలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. షార్ట్ డిస్కషన్‌లో అన్నీ చర్చిద్దామన్నారు. రూ.4,500 కోట్ల బకాయిలు ఎందుకు పెట్టారో వైసీపీ సభ్యులు చెప్పాలని ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీలు పెంచుతారు.. వాళ్లే ధర్నా చేస్తారంటూ మండిపడ్డారు. అయితే మంత్రి చెప్పినప్పటికీ వైసీపీ సభ్యులు వెనక్కి తగ్గలేదు. దీంతో వైసీపీ సభ్యుల ఆందోళన నేపథ్యంలో చైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా వైసిపి సభ్యులు సభాకార్యక్రమాలకు అడ్డుపడటంతో సభను వాయిదా వేశారు.



మార్చి 8న కడప జిల్లా ప్రొద్దుటూరులో 'కొనిరెడ్డి ఫౌండేషన్ మరియు చదువుల సాహిత్య కళా సమితి' సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి సాహిత్యపురస్కారం-2025 ప్రదానోత్సవ సభలో రచయిత చలపాక ప్రకాష్ ను జ్ఞాపిక, సన్మాన పత్రం శాలువలతో సత్కరిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, డీకే చదువులు బాబు తదితరులు


ఆహ్వానం
కుసుమ ధర్మన్న కళాపీఠం
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
సంయుక్త ఆధ్వర్యంలో
కుసుమ ధర్మన్న గారి జయంతి సందర్భంగా
కుసుమ ధర్మన్న స్మారక జాతీయ జీవనసాఫల్య పురస్కారాల ప్రదానం
"కుసుమ ధర్మన్న రచనలు - సాహితీ సమాలోచన" &
"కుసుమ ధర్మన్న కవనభేరి" పుస్తకాల ఆవిష్కరణ మహోత్సవం
తేది : 16-03-2025, ఆదివారం, ఉ॥ 9.30 గంటలకు
వేదిక : రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్
పురస్కార గ్రహీతలు
ప్రజావాగ్గేయకారులు, కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత
శ్రీ గోరేటి వెంకన్న, శాసనమండలి సభ్యులు
సభాసామ్రాట్, కళారత్న, ప్రఖ్యాత కవి
డా॥ బిక్కి కృష్ణ, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు
ఉ॥ 9.30 ని॥ల నుండి మ॥ 1 గంట వరకు
ముఖ్య అతిథి : పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, మాజీ చైర్మన్, ఆం.ప్ర. సాహిత్య అకాడమీ
సభాధ్యక్షులు : డా॥ కోయి కోటేశ్వరరావు, తెలుగుశాఖ అధ్యక్షులు, ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్.
విశిష్ట అతిథులు : శ్రీ కె.శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి దినపత్రిక పూర్వ ఎడిటర్
డా॥ జల్ది విద్యాధర్, విశ్రాంత ఐ.ఆర్.ఎస్. అధికారి
డా॥ తరపట్ల సత్యనారాయణ, నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమండ్రి
డా॥ ర్యాలి శ్రీనివాస్, తెలుగు శాఖ అధ్యక్షులు, వి.ఎస్.ఎమ్.కళాశాల, రాంచంద్రాపురం
ఆత్మీయ అతిథులు : ఆచార్య టి.గౌరీశంకర్, పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం
శ్రీ బైసా దేవదాస్, నేటినిజం పత్రిక సంపాదకులు
నిర్వహణ
డా॥ రాధా కుసుమ
కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్‌పర్సన్
99892 41319
సమన్వయం
బడేసాబ్ పి.
కుసుమ ధర్మన్న కళాపీఠం కార్యదర్శి



తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కణ్వస ట్రస్ట్ ఇంకా ఎం.వి.ఆర్. ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో
'కథాఋషి' మునిపల్లె రాజు
శతజయంతి సందర్భంగా
సాహిత్య పురస్కార సభ
పురస్కార గ్రహీతలు
తేది, సమయం
17.3.2025
సోమవారం
సాయంత్రం 6 గంటలకు
వేదిక
రవీంద్రభారతి
సమావేశమందిరం
(మొదటి అంతస్తు)
శ్రీ సుధామ గారు
ప్రముఖ సాహితీవేత్త
'సప్తపది' కవితా ప్రక్రియ సృజనకర్త
శ్రీ పి.చంద్రశేఖర ఆజాద్ గారు
సుప్రసిద్ధ కథా,నవలా, సినీ రచయిత
ముఖ్య అతిథి
శ్రీ బైస దేవదాసు గారు
సంపాదకులు 'నేటినిజం' దినపత్రిక
విశిష్ట అతిథి
శ్రీ అనిల్ అట్లూరి గారు
ప్రముఖ కథారచయిత, 'వేదిక' నిర్వాహకులు
అధ్యక్షులు
శ్రీ విహారి గారు
ప్రముఖ కవి కథకులు,వ్యాసకర్త, నవలాకారులు
ఆత్మీయ అతిథులు
శ్రీ సి.ఎస్.రాంబాబు గారు
ఆకాశవాణి విశ్రాంత ఉపసంచాలకులు
శ్రీ బొడ్డపాటి చంద్రశేఖర్ గారు
సుప్రసిద్ధ సాహితీవేత్త, ఆంగ్లోపన్యాసకులు
శ్రీ అనిల్ కిశోర్ మునిపల్లె
మునిపల్లె రాజు కుమారులు
మునిపల్లె రాజు కుటుంబ సభ్యులు
కణ్వస ట్రస్ట్
మట్టిగుంట వెంకటరమణ
ఎం.వి.ఆర్..ఫౌండేషన్


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.